# మృగశిర కార్తె సందడి



నిర్మల్ మార్కెట్లో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


నమస్తే నెట్‌వర్క్, జూన్ 8 : తొలకరి వర్షాలకు ముందు వాతావారణ మార్పులతో వచ్చే వ్యాధుల నుంచి ఉపశమనం కోసం ప్రజలు మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తున్నది. ఆదివారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రాలతో పాటు అన్ని మండలాల్లోని చేపల మార్కెట్లలో కొనుగోలుదారులతో సందడిగా మారింది. సాధారణ రకం చేపలు కిలో చేపలకు రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వైద్య ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్‌లో ప్రజలకు ఉబ్బసం వ్యాధికి మందును పంపిణీ చేశారు. సారంగాపూర్ మండలంలోని బీరవెల్లిలో సగ్గం కృష్ణ బ్రదర్స్ ఆధ్వర్యంలో చేప మందును పంపిణీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి రోగులు వచ్చారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు రూరల్ సీఐ కృష్ణ, ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు విత్తనాలతో నైవేద్యాలు సమర్పించి పంటలు బాగా పండాలని పూజలు చేశారు.




ఆదిలాబాద్‌లో చేప మందు వేస్తున్న డాక్టర్ యువరాజ్

# పీఎస్సార్‌కు మొండిచేయి

మంత్రివర్గంలో దక్కని చోటు







- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను వరించిన పదవి
- అలక బూనిన ప్రేమ్‌సాగర్‌రావు
- బుజ్జగించేందుకు రంగంలోకి పార్టీ పెద్దలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో గందరగోళం
- రెండుగా చీలిపోనున్న కేడర్
- ఆసక్తిగా మారిన హస్తం రాజకీయాలు

మంచిర్యాల, జూన్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంత్రివర్గ విస్తరణ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో గందరగోళానికి తెరలేపింది. ఆది నుంచి పార్టీని అంటిపెట్టుకొని ఉన్న సీనియర్ నాయకుడు ప్రేమ్‌సాగర్‌రావును కాదని, ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై పీఎస్సార్ వర్గం భగ్గుమంటున్నది. వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలో హస్తం పార్టీ కేడర్ రెండు వర్గాలుగా చీలిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. నిన్న మొన్నటి వరకూ అంతర్గతంగా సాగిన వివాదాలు ఇకపై ఎటుపోయి ఎటు తిరుగుతాయోనన్న పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్‌కు మంత్రి పదవి వస్తుందనే ప్రచారం జోరుగా సాగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, సీనియర్ నాయకులు సైతం పీఎస్సార్‌కు పదవి పక్కా అనే చెప్పుకొచ్చారు. అధిష్ఠానం ముందు సైతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆయననే రెఫర్ చేస్తూ వచ్చినట్లు తెలిసింది. కానీ, చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలిచిన వివేక్ వెంకటస్వామి అనూహ్యంగా రేసులోకి వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సపోర్టు దొరకడంతో మంత్రి పదవి కోసం పట్టుబిగించారు. ఇలా ఇద్దరు ఎమ్మెల్యేలు ఎవరికి వారు మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలోనే ఒకరిపై మరొకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నారు. తాజాగా.. మంత్రివర్గ విస్తరణలో అధిష్ఠానం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వైపునకు మొగ్గు చూపడం చర్చనీయాంశంగా మారింది. పీఎస్సార్ వర్గం నాయకులు అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తీవ్ర అసంతృప్తిలో పీఎస్సార్

మంత్రి పదవి దక్కకపోవడంపై మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. అలకబూనిన ఆయన రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సైతం దూరంగా ఉన్నారు. దీంతో ఆయనను బుజ్జగించేందుకు ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హైదరాబాద్‌లోని పీఎస్సార్ నివాసానికి వెళ్లారు. ''కష్టకాలంలో ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని, కార్యకర్తలను కాపాడుకున్నా. పార్టీ పరంగా నాకు అన్యాయం జరిగింది. అన్ని పార్టీలు మారి వచ్చిన వారికి మంత్రి పదవి ఇచ్చి కేడర్‌కు తప్పుడు సంకేతాలు ఇచ్చారు. రేవంత్‌రెడ్డి పీసీసీ హోదాలో ఉన్నప్పుడు ఇంద్రవెల్లిలో దళిత, గిరిజన దండోరా బహిరంగ సభ నిర్వహించి సక్సెస్ చేశాను. భట్టి విక్రమార్క పాదయాత్రను సక్సెక్ చేసి, లక్ష మందితో మంచిర్యాల సభను నిర్వహించాను. నాలా సిన్సియర్‌గా పని చేసిన నాయకుడికి న్యాయం చేస్తే కార్యకర్తలకు అది ఇన్ప్రేషన్‌గా ఉండేది. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డా. పార్టీ నాకు తీవ్ర అన్యాయం చేసింది' అంటూ పార్టీ పెద్దల ముందే ఆయన అసంతృప్తి వెల్లగక్కినట్లు సమాచారం. మంత్రి పదవి కాకుండా మరో కీలక పదవి ఆఫర్ చేయగా.. నాకు ఎలాంటి పదవులు వద్దు. కార్యకర్తగానే ఉంటా.. పార్టీని విడిచిపోను'' అని ఆయన చెప్పినట్లు తెలిసింది. పీఎస్సార్ సన్నిహితులు మాత్రం అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. మా సార్‌కు అన్యాయం చేశారంటూ వాపోతున్నారు. సార్ ఆదేశిస్తే ఏమైనా చేసేందుకు సిద్ధమని స్పష్టం చేస్తున్నారు.

## కుటుంబ రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యం..

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడం వెనుక సామాజిక సమీకరణలు, కారణాలు ఏమున్నా.. కుటుంబ రాజకీయాలను పార్టీ ప్రోత్సహిస్తుందనే ముద్ర పడిపోయింది. గతంలో ప్రేమ్‌సాగర్‌రావు సైతం ఇదే విషయాన్ని ప్రస్తావించారు. గడ్డం వివేక్, గడ్డం వినోద్‌లకు ఇద్దరికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు. వారి కుమారుడు వంశీకృష్ణకి ఎంపీ టికెట్ ఇచ్చారు. ఇప్పుడు వారి కుటుంబానికే మంత్రి పదవి ఇస్తే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీల గొంతుకగా ఉన్న నా గొంతు కోసినట్లే అంటూ చెప్పారు. మొన్నటికి మొన్న గడ్డం వివేక్ అండ్ ఫ్యామిలీ కాంగ్రెస్‌లో చీలికలు తెస్తున్నారంటూ, ప్రత్యేక వర్గాన్ని రెడీ చేసుకుంటున్నారంటూ పలుచోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులే బహిరంగ విమర్శలకు దిగారు. సొంత నియోజకవర్గ నాయకులే మా ఎమ్మెల్యే బీజేపీలోకి పోతాడా.. బీఆర్‌ఎస్‌లోకి పోతాడా అనే అనుమానాలున్నాయంటూ మాట్లాడుకొచ్చారు. కానీ ఇవేవీ కాంగ్రెస్ అధిష్ఠానం లెక్కలోకి తీసుకున్నట్లు లేదు. పార్టీ కోసం ముందు నుంచి కష్టపడిన నాయకుడికి కాదని, పార్టీలో గ్రూప్ రాజకీయాలను ప్రోత్సహించే వ్యక్తులకు పదవులు ఇవ్వడంపై మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కేడర్ అసహనం వ్యక్తం చేస్తున్నది. కుటుంబ రాజకీయాలను సహించం, కష్టపడిన వారికే పదవులు ఇస్తామంటూ చెప్పిన నీతి వ్యాఖ్యలను అధిష్ఠానం విస్మరించిదంటూ అసంతృప్తి వెల్లగక్కుతున్నారు.

## మరో విస్తరణలోనూ పీఎస్సార్‌కు కష్టమే..

తాజా మంత్రివర్గ విస్తరణలో ముగ్గురికి అవకాశం కల్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వివేక్‌కు చోట దక్కింది. సామాజికవర్గ సమీకరణలో భాగంగా ఆయనకు పదవి ఇచ్చినట్లు చెబుతున్నారు. కాగా, మంత్రివర్గంలో మరో ముగ్గురిని చేర్చుకునే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యాక మరోసారి మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. అందులో పీఎస్సార్‌కు చోటు ఉంటుందని ఆయన అనుచరులు, కార్యకర్తలు ఇప్పటికీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సైతం ఇదే హామీ ఇచ్చారని చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవ పరిస్థితి మరోలా ఉంది. జిల్లాల వారీగా చూసుకుంటే రంగారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాల నుంచి ఇప్పటి వరకు మంత్రి వర్గంలో ఎవరికి చోటు ఇవ్వలేదు. జిల్లా సమీకరణలో మిగిలిన మూడు మంత్రి పదవులను ఇలా భర్తీ చేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అదే జరిగితే ఆదిలాబాద్ జిల్లా నుంచి వివేక్ మంత్రిగా ఉన్నందున.. పీఎస్సార్‌కు ఇక మంత్రి పదవి రావడం కష్టమే అనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సామాజికి సమీకరణలు తీసుకున్నా పీఎస్సార్‌కు మంత్రి పదవి వచ్చే అవకాశాలు లేవనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. ఒకవేళ ఆయన పట్టుబడితే ఎలాంటి సమీకరణలు చేయకుండా మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేకపోలేదు. పీఎస్సార్ ఏం చేయబోతున్నారు.. భవిష్యత్తు కార్యచరణ ఏమైనా ప్రకటిస్తారా.. లేకపోతే మిన్నకుండిపోతారా... ఆయన విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది.. అన్నది ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# బియ్యం రాలే.. దుకాణం తెరవలే!

## ఆదిలాబాద్ జిల్లాలో అస్తవ్యస్తంగా రేషన్ బియ్యం పంపిణీ

- స్టేజ్-1, స్టేజ్-2 రవాణాలో జాప్యం
- గోదాంల చుట్టూ డీలర్ల ప్రదక్షిణలు
- లబ్ధిదారుల ఎదురుచూపులు



ఆదిలాబాద్ పౌరసరఫరాల శాఖ ఎంఎల్ఎస్ పాయింట్



తాంసి మండలం వడ్డాడిలో తెరుచుకోని రేషన్ దుకాణం

*ఆదిలాబాద్ జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి అందించాలని సర్కారు నిర్ణయించగా, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయకపోవడం ఆందోళనకు గురిచేస్తున్నది. సరిపడా రైస్ రాకపోవడంతో డీలర్లు దుకాణాలు మూసి ఉంచుతుండగా, ఎప్పడిస్తారోనని లబ్ధిదారులు ఎదురుచూడాల్సి వస్తున్నది.*

ఆదిలాబాద్, జూన్ 8 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో 355 రేషన్ దుకాణాలుండగా, 1,91,755 రేషన్‌కార్డులున్నాయి. వానకాలం నేపథ్యంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలో మూడు నెలల కోటా 12,600 మెట్రిక్ టన్నులను కేటాయించింది. జూన్ 1 నుంచి బియ్యం పంపిణీ ప్రారంభం కాగా 30 వరకు కొనసాగుతుందని అధికారులు అంటున్నారు. మూడు నెలల బియ్యం తీసుకునేందుకు కార్డుదారులు దుకాణాల్లో ఈ పాస్ యంత్రంపై మూడు సార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తుంది. ఫలితంగా బియ్యం పంపిణీలో జాప్యం కారణంగా దుకాణాల ముందు క్యూలైన్‌లు కనబడుతున్నాయి. రేషన్ దుకాణాల్లో బియ్యం నిల్వ ఉంచడానికి స్థలం లేకపోవడంతో డీలర్లు వారి నిల్వ సామర్థ్యం మేరకు బియ్యం తీసుకుపోతున్నారు. ఈ బియ్యం పంపిణీ పూర్తయిన తర్వాత మిగతా కోటా రావాల్సి వస్తుంది. మూడు నెలల క్రితం వరకు సరఫరా చేసిన ఫ్లోరిఫైడ్ రైస్ నిల్వలు సైతం ఉండడంతో డీలర్లు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

## పలు గ్రామాలకు చేరని బియ్యం

వానకాలం బియ్యం సరఫరా ఇబ్బందులు నివారించేందుకు ప్రభుత్వం జూన్ 1 నుంచి మూడు నెలల బియ్యం పంపిణీ ప్రారంభించినా పలు గ్రామాలకు ఇంకా సరఫరా కాలేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు బియ్యం కోసం రోజు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. బియ్యం ఎప్పుడు ఇస్తారని డీలర్లను అడిగితే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం రానిది తాము ఎక్కడి నుంచి ఇవ్వాలని వారు అంటున్నారు. తమకు రావాల్సిన మూడు నెలల కోటా కోసం డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల చుట్టూ తిరుగుతున్నామని చెబుతున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి స్టేజ్-1 సరఫరాలో భాగంగా జిల్లాలోని ఐదు ఆదిలాబాద్, జైనథ్, ఉట్నూర్, ఇచ్చోడ, బోథ్ ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరాల్సి ఉంటుంది. స్టేజ్-2లో భాగంగా ఐదు ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా రేషన్ దుకాణాలకు చేరవేస్తారు. రెండు దశల్లో జిల్లాకు రేషన్ బియ్యం సరఫరాలో స్టేజ్-1 సరఫరా సరిగా జరగడం లేదనే, స్టేజ్-2 సరఫరా గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని డీలర్లు అంటున్నారు. తలమడుగు మండలంలోని తలమడుగు, సుంకిడి, కుచులాపూర్, సాయిలింగి, ఝరి, రుయ్యాడి, ఉండం, తాంసి మండలంలో వడ్డాడి, గిరిగామ, కప్పర్లలో రెండు దుకాణాలు, భీంపూర్ మండలంలో గుబిడి, అర్లీ(టీ), ధనోర, నిపాని, భీంపూర్, తాంసి(కే), బెల్సరిరాంపూర్, వీటితో పాటు పలు మండలాల్లోని గ్రామాలు ఏజెన్సీ మండలాల్లోని గూడాలకు బియ్యం సరఫరా కాలేదు.

### వారం రోజులుగా తిరుగుతున్నా..



*మా దుకాణానికి రావాల్సిన రేషన్ బియ్యం కోటా కోసం వారం రోజుల నుంచి ఆదిలాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్ వచ్చి పోతున్నాను. ఈ నెల స్టాక్ రాకపోవడంతో ఇంకా దుకాణం తీయలేదు. స్టాక్ లేకపోవడంతో బియ్యం సరఫరాను గోదాం అధికారులు వాయిదా వేస్తున్నారు. స్టేజ్-1 సరఫరాలో భాగంగా నిజామాబాద్ నుంచి బియ్యం లారీలు సరిగా రావడం లేదు. దీంతో డీలర్లకు సరిపడా బియ్యం స్టేజ్-2లో రవాణా చేయలేకపోతున్నారు. లబ్ధిదారులు రోజూ దుకాణానికి వచ్చి మూడు నెలల బియ్యం ఎప్పుడు ఇస్తారని అడుగుతున్నారు. ఏమీ సమాధానం చెప్పలేకపోతున్నాం. అన్ని దుకాణాలకు బియ్యం సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.*

**- మార్సెట్టి అనిల్, రేషన్ డీలర్, నిపాని, భీంపూర్ మండలం**



గోదాంలో బియ్యం నిల్వలు

### బియ్యం ఇస్తలేరు



*ఈ గ్రామంలో రేషన్ దుకాణంలో ఇంకా బియ్యం ఇస్తాలేరు. ఎందుకు అని డీలర్‌ను అడిగితే బియ్యం రాలేదని అంటున్నారు. మూడు నెలల సన్నబియ్యం ఒకేసారి ఇస్తామన్నారు. రోజు రేషన్ దుకాణం దగ్గరకు వచ్చిపోతున్నాం. తొందరగా ఇస్తే మంచిగా ఉంటుంది. వానలు పడితే పొలం పనులకు వెళ్తాం.*

**- గంగమ్మ, వడ్డాడి, తాంసి మండలం**

### హమాలీల కొరత ఉంది..

*మా ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో 6 మండలాల్లో 120 దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తాం. హమాలీలు 11 మంది ఉన్నారు. ఆరుగురు డీలర్ దుకాణాలకు బియ్యం అన్‌లోడింగ్ చేయడానికి పోతారు. దీంతో బియ్యం సరఫరాలో జాప్యం జరుగుతుంది. ఈ నెల 30 వరకు కార్డుదారులు బియ్యం తీసుకునే అవకాశం ఉంది. అన్ని దుకాణాలకు బియ్యం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.*

**- మధుకర్, ఎంఎల్ఎస్ గోదాం ఇన్‌చార్జి, ఆదిలాబాద్**

# మహా ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

## 75బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై..

*ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని జడ్పీహైస్కూల్ విద్యార్థులు 75 బ్యాచ్‌లతో కూడిన మహా ఆత్మీయ సమ్మేళనాన్ని రాష్ట్రంలోనే మొదటి సారిగా ఆదివారం స్థానిక జేఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 1950 నుంచి 2025 వరకు సుమారు 75 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు చోటికి చేరడంతో పండుగ వాతావరణం నెలకొన్నది. మొదటగా గురువులను బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం చిన్ననాటి ముచ్చట్లను పంచుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ నేటి సమాజంలో పరిస్థితులు, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.* - ఉట్నూర్, జూన్ 8

# జొన్నల డబ్బులు చెల్లించాలి

- లేదంటే ఆందోళన చేస్తాం
- మాజీ ఎంపీపీ బొయిడి విఠల్

కుభీర్, జూన్ 8 : మండలంలో జొన్నలు విక్రయించిన రైతులకు వెంటనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని కుభీర్ మాజీ ఎంపీపీ బొయిడి విఠల్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ కుభీర్‌తో పాటు మండలంలోని చాత, మాలేగాంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్ ద్వారా మండలంలోని 1488 మంది రైతుల నుంచి 36783 క్వింటాళ్లు జొన్నలు కొనుగోలు చేశారని తెలిపారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.14.5 కోట్లు చెల్లించాల్సి ఉన్నదన్నారు. జొన్నలు కొని మూడు నెలలైనా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. వానకాలం సాగుకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు, ఇతర ఖర్చులకు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని, లేదంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

# నీటి వనరుల సంరక్షణలో ఆదిలాబాద్ జిల్లాకు 4వ స్థానం

- రాష్ట్రంలో నంబర్ వన్
- సెంట్రల్ వాటర్ కమిషన్ శాఖ ప్రతినిధి జతీన్

ఇంద్రవెల్లి, జూన్8 : నీటి వనరుల సంరక్షణ పథకంలో ఆదిలాబాద్ జిల్లా దేశంలో 4వ స్థానంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని జల్ సంచాయ్ భగీరథ పథకం(జేఎస్‌జేబీ), సెంట్రల్ వాటర్ కమిషన్ శాఖ ప్రతినిధి, కేంద్ర తనిఖీ బృందం అధికారి జతీన్ తెలిపారు. ఆదివారం ఇంద్రవెల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా 2018నుంచి 2025 వరకు చేపట్టిన నీటి వనరుల సంరక్షణ పథకం జల్ సంచాయ్ భగీరథ పథకం నిర్మాణ పనులను జేఎస్‌జేబీ, సెంట్రల్ వాటర్ కమిషన్ శాఖ ప్రతినిధి తనిఖీ బృందం అధికారులు పరిశీలించారు. దస్నాపూర్, వడగాం, కెస్లాపూర్, వాల్గొండా, హీరాపూర్, ఇంద్రవెల్లి, ముత్నూర్, దేవాపూర్, ధనోరా(బీ), మెండపల్లి, అంజీ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టీఏలు సంతోష్, జాదవ్ విఠల్, గణేశ్, ఎఫ్ఏలు భగవంత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.



వడగాం అటవీ ప్రాంతంలో చేపట్టిన ఈజీఎస్ పనులను పరిశీలిస్తున్న తనిఖీ బృందం అధికారులు